

అమరుల త్యాగం మరువబోం

అమరుల త్యాగాలు ఎన్నటికీ మరువబోమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. - 10లో



కేసీఆర్ చేతిలో తెలంగాణ బందీ

తెలంగాణ కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. - 10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43°/28°

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మదర్ డెయిరీ సిబ్బంది వేతనాలు పెంపు

నల్లగొండ అగ్రికల్చర్ : మదర్ డెయిరీలో పనిచేస్తున్న ఆఫీస్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, హెల్పర్లకు వేతనాలను పెంచుతున్నట్లు మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఉన్న వేతనంపై ఆఫీస్ అసిస్టెంట్‌లకు రూ.1,507, టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ.2,777, హెల్పర్లకు రూ.3,012 పెంచుతున్నట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో పోటీ నెలకొన్న నేపథ్యంలో పాల విక్రయాలపై సిబ్బంది దృష్టి సారించాలని కోరారు.

కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

రామగిరి(నల్లగొండ) : ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదేశించారు. శుక్రవారం తిప్పర్తి మండలంలోని పజ్జూరులో ఐకేపీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రైతు వేదిక వద్ద శనివారం నిర్వహించే అవతరణ వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు.

బీజేపీని గద్దె దింపడమే లక్ష్యం



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

చింతపల్లి : కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని గద్దె దింపడమే కమ్యూనిస్టుల లక్ష్యమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోద్గులమల్లేపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ అమరజీవి చేపూరి బాలయ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలన్నారు. ఈనెల 4న ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో నిర్వహించే సీపీఐ బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, రవీంద్రచారి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యం, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్యనాయక్, పల్లె నర్సింహ, యుగేందర్‌రావు, పోలె వెంకటయ్య, ఆరెకంటి రాధాకృష్ణ, పాండురంగారావు, శంషొద్దీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీకి అటానమస్ గుర్తింపు



విజయ సంకేతం చూపుతున్న సిబ్బంది

నల్లగొండ రూరల్ : పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించింది. ప్రస్తుతం న్యాక్ ఏ గ్రేడ్‌లో కళాశాల కొనసాగింది. ఈ కళాశాలలో 2,700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అటానమస్ హోదా వల్ల మహాత్మాగాంధీ యూనివర్సిటీతో సంబంధం లేకుండా కళాశాల అభివృద్ధి కోసం విద్యార్థుల భవిష్యత్ కోసం పరీక్షలు నిర్వహించడం, సిలబస్ రూపొందించుకోవడం, కొత్త కోర్సులను ప్రారంభించడంలో కళాశాలకు సొంత నిర్ణయాలు ఉంటాయి. బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో వివిధ రకాల కాంబినేషన్లలో విద్యార్థులకు చదువుకునే సౌకర్యం ఉందని, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, హానర్స్ గ్రూప్ ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు. మహిళా డిగ్రీ కళాశాల ఈ విద్యా సంవత్సరం నుంచి అటానమస్‌లో కొనసాగడం హర్షనీయమని కళాశాల ప్రిన్సిపాల్ ఘనశ్యాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దోస్త్ అడ్మిషన్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు.

యాదాద్రిలో ఊంజలి సేవ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారి ఊంజలి సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ప్రత్యేకంగా అలంకరించి, ఆలయ మాఢ, తిరువీధిలో ఊరేగించారు. అనంతరం అద్దాల మండపంలో ఊంజలి సేవ జరిపించారు. మహిళలు మంగళ హారతులతో సేవకు స్వాగతం పలికారు. ఇక యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వివిధ పూజల ద్వారా శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.34,12,537 సమకూరినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి



కలెక్టరేట్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

- తొమ్మిదేళ్ల స్వయం పాలనలో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు
- విద్య, వైద్యం, తాగు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో అపార అభివృద్ధి
- రాష్ట్రం ఏర్పడిన రోజే స్వయం పాలన ప్రారంభం కావడం చారిత్రాత్మకం
- తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలోని అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని గడియారం సెంటర్‌లో తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. పోలీస్ గౌరవవందనాన్ని స్వీకరించారు. కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన సభలో గుత్తా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతోపాటు స్వయంపాలన కూడా అదేరోజు ప్రారంభం కావడం చారిత్రాత్మకమన్నారు. స్వయం పాలనతో ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు వచ్చిందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో తెలంగాణ దేశంలోనే మోడల్‌గా.. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. విద్యా, వైద్యం, సాగు, తాగునీరు, విద్యుత్ రంగాల్లో అపారమైన అభివృద్ధిని సాధించామన్నారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అత్యాధునిక పోలీస్ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా పోలీస్ కంట్రోల్ టవర్ నిర్మించుకున్నామని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు, తెలంగాణ అమరవీరుల స్థూపం, అన్ని హంగులతో తెలంగాణ సచివాలయం వంటి చారిత్రక నిర్మాణాలు దశాబ్ది కాలంలో తెలంగాణ సాధించిన అభివృద్ధికి సూచికలని ఆయన అభిప్రాయపడ్డారు.

వ్యవసాయంలో దేశానికే ఆదర్శం..

వ్యవసాయ రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి దిశానిర్దేశం చేస్తోందని చెప్పారు. రైతుబంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టి కేసీఆర్ రైతు బాంధవుడిగా నిలిచాడన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో నల్లగొండ జిల్లా అగ్రస్థానంలో నిలిచిందన్నారు. వ్యవసాయ పరమైన అంశాలపై రైతులు చర్చించుకోవడానికి వీలుగా రైతు వేదికలను నిర్మించామన్నారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగు పెరిగిందన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువులను పూడిక తీయడంతో నేడు భూగర్భ జలాలు పెరిగాయన్నారు.

సాగునీటి రంగంలో స్వర్ణయుగం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాగునీటి రంగంలో స్వర్ణయుగం తలపిస్తోందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రం అన్నపూర్ణగా అవతరించి దేశానికి అన్నం పెడుతున్న పరిస్థితి ఏర్పడిందన్నారు.



క్లాక్ టవర్ వద్ద అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనులు పురోగతిలో ఉన్నాయని, ఉదయ సముద్రం పథకం కింద లక్ష ఎకరాలకు నీరందించేందుకు రూ.524 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశామన్నారు. డిండి లిఫ్టు ఇరిగేషన్ పథకం ద్వారా 3.61లక్షల ఎకరాలకు నీరందించేందుకు పనులు ప్రారంభించామన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్నారు. దామరచర్ల వద్ద 5600 ఎకరాల్లో రూ.30 వేల కోట్లతో 4000 మెగావాట్ల సామర్థ్యం గల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మిస్తున్నామని.. డిసెంబర్ 2024 నాటికి మూడు యూనిట్ల నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు.

ఫ్లోరైడ్ పీడ విరగడ

మిషన్ భగీరథ ద్వారా సురక్షితమైన నీటిని ఇంటింటికి అందిస్తుండడంతో ఫ్లోరైడ్ పీడ విరగడైందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్య అందిస్తున్నామని చెప్పారు. విదేశాల్లో చదువుకునేందుకు సాయం అందిస్తున్నామన్నారు. మెడికల్ కాలేజీతోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కూడా మెరుగుపర్చడం జరిగిందన్నారు. సాగర్‌లో బుద్ధవనాన్ని అద్భుతంగా నిర్మించుకున్నామని పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలన్నింటినీ ప్రజలకు అందేవిధంగా కృషి చేస్తున్న జిల్లా మంత్రి జగదీశ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిలుమర్తి లింగయ్య, రవీంద్రకుమార్, నోముల భగత్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, ఎస్పీ అపూర్వరావు, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, అదనపు కలెక్టర్లు ఖుష్బూగుప్తా, భాస్కర్ రావు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగులు నింపుతున్న పథకాలు..

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. దళిత బంధు పథకం ద్వారా జిల్లాలో 517 కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున అందించామన్నారు. పదేళ్ల కాలంలో 65,384 మంది గొల్ల కురుమలకు గొర్రెల యూనిట్లను పంపిణీ చేశామన్నారు. నాయి బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. గంగపుత్రులు, ముదిరాజ్‌ల కోసం జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లలను వదులుతున్నామని చెప్పారు. గీత కార్మికుల సంక్షేమం కోసం చెట్ల పన్ను తొలగించడంతోపాటు వారి అభివృద్ధి కోసం ప్రభుత్వం భూముల్లో ఖర్జూర, ఈత చెట్లు నాటుతున్నామన్నారు. రూ.2016 ఆసరా పింఛన్ ఇస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా ఆడపిల్లల పెళ్లికి రూ.1,00116 అందిస్తున్నామన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి. చిత్రంలో జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, భగత్, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు

నేడు రైతు దినోత్సవం

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి 140 క్లస్టర్ల పరిధిలోని రైతు వేదికల వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. క్లస్టర్ల పరిధిలో వెయ్యి మందికి భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. తిప్పర్తి మండలంలోని పజ్జూరులో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, అనిశెట్టి దుప్పలపల్లిలో అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా రైతు వేదికల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ : తెలంగాణ అవతరణ ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు సలాం' పేరుతో నల్లగొండలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. శ్రీకాంతాచారి విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణత్యాగాలు చేస్తుంటే చలించిన సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఆనాడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి పదవికి రాజీనామా చేసి గడియారం సెంటర్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు.



సోనియా ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కార్యక్రమంలో జెడ్పీటీసీలు వంగూరి లక్ష్మయ్య, సైదులు, సుమన్, కౌన్సిలర్లు కరుణాకర్‌రెడ్డి, సమద్, ఖలీల్, వేణు, శంకర్, నాయకులు ఇంథియాజ్, శ్రీనివాస్, జానయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

పీపుల్స్ మార్చ్‌ను విజయవంతం చేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్


దేవరకొండ : సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 7వ తేదీన చందంపేట మండలం తెల్దేవర్‌పల్లి నుంచి యాత్ర ప్రారంభమై 10వ తేదీ వరకు దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట, నేరేడుగొమ్ము, దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల మీదుగా సాగుతుందని ఆయన తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వద్య రమేశ్‌నాయక్, పీసీసీ సభ్యులు జాల నర్సింహారెడ్డి, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, ఎంఏ.సి రాజ్‌ఖాన్, ఎండీ.యూనుస్, భవాని పవన్‌కుమార్, దూదిపాళ్ల రేఖశ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

ప్రజాక్షేత్రంలోకి బీజేపీ

- మహాజన సంపర్క్ అభియాన్ పేరుతో కార్యక్రమాలకు సన్నద్ధం
- కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో ప్రజల్లోకి..
- మూడో వారంలో బండి సంజయ్‌తో నల్లగొండలో బహిరంగ సభ
- ఏర్పాట్లు చేస్తున్న బీజేపీ శ్రేణులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రజా క్షేత్రంలోకి వెళ్లే కార్యాచరణతో జిల్లాలో బీజేపీ స్పీడ్ పెంచేందుకు సిద్ధమైంది. ఈ నెలాఖరు వరకు వరుస కార్యక్రమాలను రూపొందించుకుంది. ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన 9 ఏళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లనుంది. వారంలో పార్టీ అంతర్గత కార్యక్రమాలతో ప్రారంభించి, రెండో వారం, మూడో వారం సభలు, బహిరంగ సభలు నిర్వహించాలని, నాలుగో వారంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. మహజన సంపర్క్ అభియాన్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు చేరువ కావాలని నిర్ణయించింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పదాధికారులు, ఇన్‌ఛార్జీలు, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్లు, అసెంబ్లీ కన్వీనర్లతో ఇటీవల సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ నెలలో ఒక్కో వారంలో ఒక్కో రకమైన కార్యక్రమాలతో ముందుకెళ్లాలని నిర్ణయించారు.

రెండో వారం నుంచి వేగవంతం

మొదటి వారంలో పార్టీ అంతర్గత విభాగాలతో సమావేశాలు నిర్వహించుకొని రెండో వారం నుంచి బహిరంగ కార్యక్రమాలకు బీజేపీ ప్లాన్ చేసింది. అసెంబ్లీ నియోజకవర్గం వారీగా సీనియర్ నాయకుల సమ్మేళనాలు నిర్వహించనుంది. అక్కడే భోజన ఏర్పాట్లు చేయడంతోపాటు ఆయా సమావేశంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పార్టీ శ్రేణులకు వివరించనుంది. ఆ తర్వాత అసెంబ్లీ స్థానం వారీగా సంయుక్త మోర్చాల సమ్మేళనాలు, నియోజకవర్గానికి 150 మంది ప్రముఖులను కలవడం, కేంద్ర పథకాలను వివరించడం వంటి కార్యక్రమాలను చేపట్టనుంది. 10వ తేదీన లేదా 11న నల్లగొండ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉన్న కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండేతో నల్లగొండలో సభ నిర్వహించేందుకు ప్లాన్ చేస్తోంది. ఈ నెల మూడో వారంలో ఒక్కో నియోజకవర్గంలో 5వేల మందితో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సభలను నిర్వహించనుంది. 15వ తేదీ నుంచి 22వ తేదీ మధ్యలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు జిల్లా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 21వ తేదీన మండలాల వారీగా యోగా దివస్ నిర్వహించనున్నారు.

నాలుగో వారంలో ఇంటింటికి బీజేపీ

ఇక.. నాలుగో వారంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించనున్నారు. శక్తి కేంద్రాల వారీగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమ్మేళనాలు, ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, వారితో సమావేశం కావడం, వంటి కార్యక్రమాలను చేపడతారు. 25వ తేదీన పోలింగ్ బూత్‌స్థాయిలో మన్‌కీ బాత్ నిర్వహిస్తారు. ఇంటింటికి ప్రచారంలో కరపత్రాలను, స్టిక్కర్లను అందిస్తారు.

కేంద్ర పథకాలను వివరిస్తాం

కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రజలకు చేకూరుతున్న మేలును ప్రజలకు వివరిస్తాం. 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేకూరిన ప్రయోజనాలను తెలియజేస్తాం. పార్టీని బలోపేతం చేస్తాం.

–కంకణాల శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

పక్కాగా ఏర్పాట్లు

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లేందుకు పక్కా కార్యాచరణను సిద్ధం చేశాం. కేంద్ర పథకాలను, వాటి ద్వారా ప్రజలకు చేకూరిన మేలును వివరించడం ద్వారా ప్రజలు బీజేపీ వైపు మళ్లేలా కృషి చేస్తాం. తద్వారా అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అధిక స్థానాలు గెలుచుకునేలా చర్యలు చేపడుతున్నాం.

–మాదగోని శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి

45 డిగ్రీల ఉష్ణోగ్రత



మధ్యాహ్నం సమయంలో నిర్మానుష్యంగా ఉన్న నల్లగొండలోని ప్రకాశం బజార్

- జిల్లా అంతటా నిప్పుల కుంపటి
- ఎండ తీవ్రతకు అల్లాడిన జనం
- కర్ఫ్యూను తలపించిన వీధులు

నల్లగొండ టౌన్ : నల్లగొండ జిల్లా శుక్రవారం నిప్పుల కుంపటిని తలపించింది. దామరచర్ల, నిడమనూరు, కేతేపల్లి మండలాల్లో ఏకంగా 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మిగతా మండలాల్లో 41 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మూడు రోజుల క్రితం ఉపరితల ద్రోణి కారణంగా కురిసిన వర్షానికి ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఊరట చెందారు. ఇప్పుడు ఒక్కసారిగా పగటి ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీల వరకు పెరిగిపోవడంతో ఎండ తీవ్రత కారణంగా జనం అల్లాడారు. ఉపాధి హామీ కూలీలు, నిర్మాణ రంగ కార్మికులు ఎండలతో అనేక ఇబ్బందులు పడ్డారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఉద్యోగుల సైతం ఎండ తీవ్రతకు తల్లడిల్లిపోయారు.

కర్ఫ్యూను తలపించిన వీధులు

ఎండ తీవ్రత పెరగడంతో ఉదయం 9 గంటల నుంచే నల్లగొండ పట్టణంలోని ప్రధాన రహదారులు జనం లేక కర్ఫ్యూని తలపించాయి. సాయంత్రం 6 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు బయటికి వచ్చేందుకు సాహసించలేదు. ఏసీలు, కూలర్లు వాడకం పెరిగి.. విద్యుత్ వినియోగం పెరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు అసౌకర్యానికి గురయ్యారు. రోహిణి కార్తె కావడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. మృగశిర కార్తె ప్రారంభమయ్యాక ఎండలు తగ్గే అవకాశం ఉంటుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నాదీ పేద కుటుంబమే..

- గురిపెట్టి చదివితే లక్ష్యం సాధించవచ్చు
- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నల్లగొండ టౌన్ : 'నాది పేద కుటుంబమే.. కష్టాలంటే ఏంటో తెలుసు.. అవి చూసి తల్లిదండ్రులు పడే బాధ తెలుసు. అందుకే కష్టపడి చదివి నేడు జిల్లా అదనపు కలెక్టర్ స్థాయికి వచ్చాను. మీరు నాలాంటి పేద పిల్లలే గురిపెట్టి చదివి లక్ష్యాన్ని సాధించి కన్నవారి కలలు సహకారం చేయాలి' అని అదనపు కలెక్టర్ భాస్కరరావు సూచించారు. శుక్రవారం నల్లగొండలోని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల కోసం చదువుతున్న అభ్యర్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాను హాస్టల్‌లో ఉండి ఎంతో కష్టపడి చదివానని చెప్పారు. ప్రతి ఒక్కరూ మూస పద్ధతిలో కాకుండా శ్రద్ధతో చదవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ చదువుకోవడానికి ఒక వసతి కావాలని ఆ అవకాశాన్ని ఎంవీఎన్ విజ్ఞాన కేంద్రం అందిస్తోందని.. చెప్పారు. పుస్తకాలను ఉచితంగా అందిస్తున్న విజ్ఞాన కేంద్ర నిర్వాహకులను ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ట్రస్ట్ కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి, కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య, తుమ్మల వీరారెడ్డి, పాలడుగు నాగార్జున, సయ్యద్ హాశం, బండ శ్రీశైలం, ప్రభావతి, పొట్టబత్తిని యాదగిరి, నరేష్, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

క్లుప్తంగా

పెట్రోల్ బంక్‌లో యువకుల వీరంగం

- బంక్ సిబ్బంది, పోలీసులపై దాడి
- ఇద్దరి అరెస్ట్

నూతనకల్: మండల కేంద్రంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో గురువారం సాయంత్రం ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. బంక్ సిబ్బందితో పాటు పోలీసులపై దాడి చేశారు. బంక్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇండియన్ ఆయిల్ బంక్‌లో పెట్రోల్ కొట్టించుకునేందుకు వచ్చిన ఇద్దరు యువకులు బంక్ సిబ్బంది పట్ల అసభ్యంగా ప్రవర్తించి విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులపై కూడా యువకులు దాడి చేయగా వారిని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ హరిప్రసాద్‌ను వివరణ కోరగా.. సూర్యాపేట మండలం యర్కారం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తప్పతాగి బంక్ సిబ్బందితో పాటు పోలీసులపై దాడి చేయగా వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

కారు, రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

భువనగిరిటౌన్: కారు, రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలైన సంఘటన భువనగిరి మండల పరిధిలోని కునూరు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరికి చెందిన భరత్, అతడి తల్లి ఉప్పలమ్మ కునూరులో తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి రాయిగిరి వైపు వస్తుండగా ఎదురుగా అతివేగంగా వచ్చిన కారు వీరి బైక్‌తో పాటు మరో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భరత్, ఉప్పలమ్మతో పాటు మరో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

• వైభవంగా 'దశాబ్ది' పండుగ


సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


సూర్యాపేటలో అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


నల్లగొండలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి


సీఎం కప్ విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తున్న గుత్తా


యాదాద్రి భువనగిరి జిల్లాలో అమరవీరుల కుటుంబాలను సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తదితరులు


నల్లగొండ కలెక్టరేట్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


సూర్యాపేటలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు


సూర్యాపేటలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఘనంగా అవతరణ వేడుకలు


ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న ఎస్పీ అపూర్వరావు


జిల్లా జైలులో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న సూపరింటెండెంట్ దేవ్‌లానాయక్


అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో..

నల్లగొండ క్రైం: రాష్ట్ర అవతరణ వేడుకలను జిల్లా కేంద్రంలోని వివిధ కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అపూర్వరావు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా జైలులో సూపరింటెండెంట్ దేవ్‌లానాయక్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జైలులో పోలీసు కవాతు నిర్వహించారు. అన్నెపర్తిలోని 12వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ రామకృష్ణ జాతీయ జెండా ఆవిష్కరించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

- పానగల్లులోని ఉదయ సముద్రంలో ప్రమాదం
- మృతుడి స్వస్థలం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి


నాగరాజు (ఫైల్)

నల్లగొండ క్రైం: పానగల్లులోని ఉదయ సముద్రంలో గురువారం చేపల వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం శుక్రవారం లభ్యమైంది. నల్ల గొండ టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన అంబటి నాగరాజు(30) తన భార్య ప్రశాంతి, ఇద్దరు కుమార్తెలతో కలిసి నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో అద్దె ఇంట్లో నివాసముంటూ ఉదయ సముద్రంలో చేపలు పడుతూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం కూడా అతడు చేపలు పట్టేందుకు తెప్పపై ఉదయ సముద్రంలోకి వెళ్లగా ఈదురు గాలులకు తెప్ప తిరగబడడంతో నీటిలో పడిపోయాడు. ఒడ్డుకు 10ఫీట్ల దూరం వరకు ఈదుకుంటూ వచ్చిన నాగరాజు అప్పటికే అలసిపోయి చెరువులోనే గల్లంతయ్యాడు. తోటి జాలర్లు గమనించి నాగరాజు మృతదేహం కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వెంటనే కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని గురువారం రాత్రంతా నాగరాజు మృతదేహం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం ఒడ్డున నాగరాజు మృతదేహం లభ్యమవ్వడంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

పెద్దదేవులపల్లిలో విషాదఛాయలు..

త్రిపురారం: అంబటి నాగరాజు మృతితో త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నాగరాజు నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్లులో నివాసముంటూ పెద్దదేవులపల్లి గ్రామంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌లో సివిల్ వర్కర్‌గా పనిచేస్తుండేవాడని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో పాటు నాగరాజు మత్స్యకారుడు కావడంతో అదనపు ఆదాయం కోసం సమయం ఉన్నప్పుడల్లా పానగల్లులోని ఉదయ సముద్రంలో చేపలు పట్టి అమ్మేవాడని తెలిపారు. కాగా శుక్రవారం పెద్దదేవులపల్లిలో నాగరాజు కుటుంబ సభ్యులు అతడి అంత్యక్రియలు నిర్వహించారు. నిరుపేద అయిన నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలని పెద్దదేవులపల్లి మత్స్యకార సంఘం సభ్యులు కోరుతున్నారు.



వడదెబ్బతో ఒకరు మృతి

పెద్దవూర: వడదెబ్బతో ఓ వ్యక్తి మృతిచెందాడు. పెద్దవూర మండలం నీమానాయక్‌తండాకు చెందిన రమావత్ బాలు(33) గురువారం తన వ్యవసాయ పొలంలో పనులు చేయటానికి వెళ్లి మధ్యాహ్నం 2 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. విపరీతమైన ఎండలకు వడదెబ్బకు గురై ఇంటికి రాగానే కడుపులో నొప్పి వస్తుందని వాంతులు చేసుకున్నాడు. దీంతో కుటుంబసభ్యులు స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

యువకుడు అదృశ్యం


సాయి

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని హనుమాన్‌నగర్‌కాలనీలో మానసిక స్థితి సరిగా లేని ఓ యువకుడు గురువారం తప్పిపోయాడు. ఈమేరకు ఎస్సై సైదులు శుక్రవారం వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చింతల్‌లోని వాజ్‌పేయినగర్‌కు చెందిన కుంభా యేసమ్మ తన కుమారుడు కుంభా సాయి(19)తో కలిసి స్థానిక హనుమాన్‌నగర్‌లో ఉంటుంది. యేసమ్మ కేశాల వ్యాపారం చేస్తుంటుంది. కుమారుడు మానసిక స్థితి సరిగ్గా లేకపోవడంతో ఇంటి వద్దే ఉంటాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన సాయి తిరిగి ఇంటికి చేరుకోలేదు. స్థానికంగా, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో యేసమ్మ శుక్రవారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మంటలు చెలరేగి రెండు బైక్‌లు, ఆటో దగ్ధం


డిండి: వివాహం జరిగిన ఓ ఇంట్లో ప్రమాదవశాత్తు టెంటుకు నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగి రెండు బైక్‌లు, ఆటో దగ్ధమయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం డిండి మండలంలోని గోనబోయనపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోనబోయనపల్లి గ్రామానికి చెందిన మండి వెంకటయ్య కుమారుడు సైదులు వివాహం గురువారం జరిగింది. వివాహాన్ని పురస్కరించుకొని ఇంటి ముందు ఏర్పాటు చేసిన టెంట్‌కు గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. ఇది గమనించిన వెంకటయ్య కుటుంబ సభ్యులు, బంధువులు మంటలు ఆర్పేసరికి టెంటు కింద ఉన్న నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం గాజర గ్రామానికి చెందిన గణేష్ బైక్‌తో పాటు మరో బంధువు బైక్ పూర్తిగా దగ్ధమయ్యాయి. అదేవిధంగా మండి వెంకటయ్యకు చెందిన ఆటోలోని సీట్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూటే కారణమై ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు.

గ్రామపంచాయతీ ట్రాక్టర్ బోల్తా


బోల్తా పడిన ట్రాక్టర్

త్రిపురారం: మండలంలోని బొర్రాయిపాలెం గ్రామపంచాయతీ ట్రాక్టర్ హర్జ్యతండా సమీపంలో శుక్రవారం బోల్తా పడింది. ట్రాక్టర్ నడపడం రాని వ్యక్తి ట్రాక్టర్ నడపడంతోనే బోల్తా పడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ట్రాక్టర్‌లో సెంట్రింగ్‌కు సంబంధించిన సామగ్రి ఉండడంతో గ్రామపంచాయతీ పనులకు కాకుండా ఇతర పనులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తున్నట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బొర్రాయిపాలెం సర్పంచ్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చార్‌ధామ్ యాత్రలో కొండమల్లేపల్లి వాసి మృతి


మురళి (ఫైల్)

కొండమల్లేపల్లి: చార్‌ధామ్ యాత్రలో భాగంగా ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని కేదార్‌నాథ్ దర్శనానికి వెళ్లి కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ కండక్టర్ మారం మురళి(75) మే 27న మండల కేంద్రానికే చెందిన కండె చంద్రయ్య కుటుంబ సభ్యులతో కలిసి చార్‌ధామ్ యాత్రకు బయల్దేరారు. యాత్ర ప్రారంభమైన నాటి నుంచి తన యోగక్షేమాలు ఫోన్ ద్వారా కుమారుడు వెంకటేశ్వర్లుకు తెలియజేసేవాడు. గురువారం మురళి ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుమారుడు వెంకటేశ్వర్లు తన తండ్రి గురించి తెలుసుకునేందుకు కండె చంద్రయ్యకు ఫోన్ చేశాడు. తామంతా గదిలోనే ఉన్నామని, మురళి ఒక్కడే గుర్రంపై కేదార్‌నాథ్ దర్శనానికి వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదని ఆయన తెలిపాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం తన తండ్రి మరణించినట్లు తెలిసిందని వెంకటేశ్వర్లు పేర్కొన్నాడు. మృతదేహాన్ని ఇక్కడకు తీసుకురావడం కోసం ఉత్తరాఖండ్ వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బద్దం రాజు(26)కు భార్య తులసి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈయన ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా పని సరిగా నడవకపోవడంతో అప్పులు చేశాడు. అంతేకాక మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఇంట్లో కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్య, తండ్రితో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రి గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం గ్రామానికి చెందిన దేవిగారి బాలయ్య అనే రైతు గ్రామశివారులో ఉన్న వ్యవసాయబావి వద్దకు పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా అక్కడ చెట్టుకు చొక్కాతో ఉరివేసుకున్న రాజును గమనించాడు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య తులసి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం


సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

పెద్దవూర: బైక్‌ను కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం పెద్దవూర మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలంలోని చలకుర్తి గ్రామానికి చెందిన మాసిన సత్యనారాయణరెడ్డి(33) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తన బైక్‌పై పెద్దఅడిశర్లపల్లికి వెళ్లి పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా పెద్దవూర మండల కేంద్రంలోని వ్యవసాయ సబ్ మార్కెట్ సమీపంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే మల్లేపల్లి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై సత్యనారాయణరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి.. డివైడర్‌ను ఢీకొట్టి..

కట్టంగూర్: మండలంలోని పామనగుండ్ల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట మండలం శోభనాద్రిపురం గ్రామానికి చెందిన ఎస్. సయ్యద్(26) తన తల్లితో కలిసి బైక్‌పై స్వగ్రామం నుంచి కట్టంగూర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో పామనగుండ్ల గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే బైక్ అదుపు తప్పడంతో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో సయ్యద్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ ప్రమాదంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు..



ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ రోడ్డులో వోల్వో బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆలేరు ఎస్సై వెంకటశ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు బైపాస్ రోడ్డులోని మాడీస్ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం తెల్ల వారుజామున 3 గంటల ప్రాంతంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వరంగల్ డిపోకు చెందిన ఆర్టీసీ వోల్వో బస్సు ఢీకొంది. దీంతో అతడి తల, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వీఆర్‌ఏ భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉంచినట్లు పేర్కొన్నారు.

గుట్టుగా నకిలీ విత్తనాల దందా!

నాగపూర్ కేంద్రంగా వ్యాపారం

- పోలీసుల కళ్లు గప్పి రైతులకు సరఫరా
- చౌటుప్పల్‌లోని నవత ఆగ్రో డివిజన్ గోదాముపై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు
- 2.2 టన్నుల నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం
- ఇద్దరి అరెస్ట్, పరారీలో మరొకరు


చౌటుప్పల్‌లో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాల బ్యాగులను పరిశీలిస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

చౌటుప్పల్: వానాకాలం సమీపిస్తుండడంతో నకిలీ విత్తనాల వ్యాపారం చాపకింద నీరులా విస్తరిస్తోంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నా వ్యాపారులు తమకున్న మార్గాల ద్వారా అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. చౌటుప్పల్‌కు చెందిన ఓ వ్యాపారి కొన్నేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి రైతులకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తుండగా అతడి దుకాణంపై ఇటీవల ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి రూ.60లక్షల విలువ చేసే విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు.

నాగపూర్ నుంచి సరఫరా

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మైలవరానికి చెందిన రావి చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం చౌటుప్పల్‌కు వచ్చాడు. నవత ఆగ్రో డివిజన్ పేరిట దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నాడు. ఆయన కుమారుడు ప్రసన్నకుమార్ సైతం ఇదే వ్యాపారంలో ఉన్నాడు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో స్థిరపడిన ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా గారపాడు గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రబాబు, చిత్తూరు జిల్లా మదనపల్లికి చెందిన నర్సింహులుతో కలిసి ప్రసన్నకుమార్ నకిలీ విత్తనాల దందా సాగిస్తున్నాడు. నిషేధిత బీటీ-3 హెచ్‌టీ విత్తనాలను మహారాష్ట్రతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో నాగపూర్ నుంచి పెద్ద ఎత్తున తీసుకువచ్చిన పత్తి విత్తనాలను చౌటుప్పల్‌లోని గోదాంలో నిల్వ చేశారు. రైతులకు సరఫరా చేసే క్రమంలో విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు గురువారం దాడులు నిర్వహించి పట్టుకున్నారు. 2.2 టన్నుల విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు సభ్యులు గల ముఠాలో రవీంద్రబాబు, ప్రసన్నకుమార్‌ను అదుపులోకి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు నర్సింహులు పరారయ్యాడు. కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విత్తనాల విలువ రూ.60లక్షల వరకు ఉంటుందని అంచనా. ఎస్‌ఓటీ పోలీసులు ఈ కేసును స్థానిక పోలీసులకు అప్పగించారు. కాగా పట్టుబడిన విత్తనాలను గురువారం హైదరాబాద్‌లో సీపీ డీఎస్ చౌహాన్ సమక్షంలో వ్యవసాయాధికారులు టెస్ట్ చేయగా నకిలీవిగా నిర్ధారణ అయ్యింది.

లాభార్జనే ధ్యేయంగా..

విత్తన దుకాణాల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా వ్యాపారం సాగిస్తున్నారు. రైతుల ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. సీజన్ ప్రారంభం అవ్వగానే తనిఖీ బృందాల కళ్లుగప్పి రకరకాల విత్తనాలు తీసుకువచ్చి రైతులకు అంటగడుతున్నారు. చేను ఎదుగుదల, పంటల దిగుబడి వంటి అంశాలను పూర్తిగా విస్మరిస్తున్నారు.

హడావుడిగా తనిఖీలు!

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ టీంలను ఏర్పాటు చేశారు. ఆయా బృందాలు ఎరువులు, విత్తన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అయినా వ్యాపారులు అధికారుల కళ్లుగప్పి తమ దందా కొనసాగిస్తున్నారు. అధికారులు దుకాణదారులతో ఉన్న సంబంధాలతో మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నల్లగొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లో శుక్రవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా నల్లగొండలోని బాలభవన్ విద్యార్థులు, నాగార్జునసాగర్ పాఠశాల విద్యార్థులు, న్యాక్స్ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులతో పాటు పలువురు తెలంగాణ ఉద్యమంతో పాటు తెలంగాణ సాయుధ పోరాటాలను ఆవిష్కరించే విధంగా కళా నృత్యాలు ప్రదర్శించారు. కోలాటం తదితర ఆటాపాటలతో తెలంగాణ సాధించిన ప్రగతిపై నృత్య ప్రదర్శనలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా వారికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం కప్ క్రీడాపోటీల్లో రాష్ట్రస్థాయిలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పాఠశాలలో చోరీకి యత్నం

మాడుగులపల్లి: మండలంలోని కుక్కడం ప్రాథమికోన్నత పాఠశాలలో దుండగులు చోరీకి యత్నించారు. ఆఫీస్ గది తలుపులు పగులగొట్టి బీరువాలను తెరిచేందుకు ప్రయత్నించారు. హెచ్‌ఎం వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆఫీస్ గదిలో కంప్యూటర్లు, మధ్యాహ్న భోజనానికి కావాల్సిన బియ్యం, ఇతర వస్తువులతో పాటు మూడు బీరువాలు ఉన్నాయి. వీటిలో సైన్స్ మెటీరియల్, రికార్డులు, ఆట సామగ్రి భద్రపరిచారు. కాగా దుండగులు గది తలుపులు ధ్వంసం చేసి ఓ బీరువాను ఇనుప చువ్వ సాయంతో తెరిచారు. ఇందులో సైన్స్ మెటీరియల్ ఉండడంతో అలాగే వదిలేశారు. మిగిలిన రెండింటి తలుపులు తెరుచుకోకపోవడంతో వెళ్లిపోయారు. శుక్రవారం దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు సిబ్బంది పాఠశాలకు రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మే 12న పాఠశాలను సందర్శించినప్పుడు సవ్యంగానే ఉందని, ఆ తర్వాత ఈ ఘటన జరిగిందని హెచ్‌ఎం భావిస్తున్నారు. బీరువాలోని ఆట వస్తువుల కోసమే చోరీకి యత్నించినట్లు అనుమానాలు ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.